www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

మంగళవారం, 09-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :40 Issue : 40 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ దశాబ్ది


5

## జాన్వీ కపూర్ చెప్పినా డైరెక్టర్ వినలేదు

8



# బీఆర్ఎస్‌లో మరో వర్కింగ్ ప్రెసిడెంట్..?



- బీసీ నేతకు కీలక పదవిపై జోరుగా చర్చ
- అసెంబ్లీ ఎన్నికల లక్ష్యంగా పార్టీ పునర్వ్యవస్థీకరణకు అధిష్ఠానం కసరత్తు
- సామాజిక సమీకరణాలపై ఫోకస్..
- బీసీ వర్గాలకు పెద్దపీట వేసే యోచన
- సెప్టెంబర్‌అక్టోబర్ అధ్యక్ష ఎన్నికల సమయంలోనే నిర్ణయం వెలువడే అవకాశం
- తలసాని, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ సహా పలువురు నేతల పేర్లు ప్రచారంలో
- తుది నిర్ణయంపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:** రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే పనిలో బీఆర్ఎస్ అధిష్ఠానం నిమగ్నమైంది. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జ్‌లను నియమించిన పార్టీ, తదుపరి దశలో గ్రామ, మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా పునర్వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో పార్టీలో కొత్తగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చ సాగుతోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాలకు

మిగతా 3వ పేజీలో..



# అభివృద్ధే లక్ష్యం..

### వచ్చే రెండున్నరేళ్లు తెలంగాణ వికాసానికే అంకితం



## మల్కాజిగిరిలో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మిస్తాం: సీఎం రేవంత్

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:** రాష్ట్ర అభివృద్ధినే ప్రధాన ఎజెండాగా తీసుకుని వచ్చే రెండున్నరేళ్లు తెలంగాణ వికాసం కోసం నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి బాధ్యతను చేపడతామని స్పష్టం చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా

మిగతా 2వ పేజీలో..



## సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ.25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:** ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించే దిశగా కృతనిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ.25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్‌కు సంబంధించి స్థల

మిగతా 3వ పేజీలో..

## మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు
- సీఎం రేవంత్ సమక్షంలో నేడు అందజేత




3



3

## యూరియా యాప్‌తో రైతులకు మేలు

- అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి
- ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ

## రేవంత్ హిట్లర్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్



- నియంత వారసత్వాన్ని పాటిస్తున్న సీఎం
- సీఎంవి ఫాసిస్టు విధానాలు
- కాంగ్రెస్‌వి ద్వంద్వ విధానాలు
- ఏఐసీసీని ఆల్ ఇండియా నాజీ పార్టీగా మార్చుకోవాలి
- రాహుల్ ని టార్గెట్ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏఐసీసీ తన సిద్ధాంతాల ముసుగును తొలగించి అధికారికంగా తన పేరును ఆల్ ఇండియా నాజీ పార్టీగా మార్చుకోవాలన్నారు. 'ఎక్స్' వేదికగా కేటీఆర్ నేరుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్

మిగతా 2వ పేజీలో..

## మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క ,పొన్నం ప్రభాకర్ పిలుపు

2





2



## ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

- విదేశ్శ ప్రయాణజకలు రాకపై ప్రత్యేక నిఘా
- ఎబోలా లక్షనాలు ఉంటే గుర్తించి గాంధీకి తరలింపు
- వ్యాధి లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వాల్సిందే
- అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:** కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు,

మిగతా 3వ పేజీలో..




## పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల సహకారం
- అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి


3

## బొగ్గు దిగుమతులు తగ్గించే యత్నం

- ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్
- మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదు లక్షల మందికి ఉపాధి
- క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

2





## చేప మందు పంపిణీ షురూ

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనార్
- భారీ బందోబస్తు ఏర్పాటు

2

## గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి పూర్తి పారదర్శకత పాటించాలి

- విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు
- ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష



**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మిగతా 3వ పేజీలో..

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వి అప్డేట్:**

తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమ□లల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ□`దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎసఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ□`దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమ□లల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సవి□కృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. □రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్దిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.



# అభివృద్ధే లక్ష్యం.. వచ్చే రెండున్నరేళ్లు తెలంగాణ వికాసానికే అంకితం

మొదటిపేజీ తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవనంతో పాటు మొత్తం రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం మియాపూర్ క్రాస్‌రోడ్స్ వద్ద జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.

మల్కాజిగిరి పరిధిలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు పనులను వచ్చే మూడు నెలల్లో ప్రారంభిస్తామని తెలిపారు.

హైదరాబాద్ మహానగర అభివృద్ధికి మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. రాయదుర్గం నుంచి నియోపోలిస్ వరకు మెట్రో విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలంటే అందుకు అనుగుణమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనాలను ఆధునిక సదుపాయాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. నగరంలో పేదలకు గృహాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, ట్రాఫిక్, వరదల సమస్యలను అధ్యయనం చేసి హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో 1.34 కోట్ల జనాభా నివసిస్తోందని, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఉద్యోగ, ఉపాధి కోసం పెద్ద ఎత్తున ప్రజలు హైదరాబాద్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది నగరం సుమారు మూడు శాతం వృద్ధి చెందుతోందని తెలిపారు. గతంలో వివిధ స్థానిక సంస్థల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో పరిపాలనలో సమన్వయ లోపాల కారణంగా తాగునీరు, రోడ్లు, మురుగునీటి పారుదల, విద్యుత్, చెత్త నిర్వహణ వంటి సమస్యలు తలెత్తాయని చెప్పారు. అందుకే నిపుణుల సూచనల మేరకు 2,100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు వివరించారు. 150 డివిజన్లతో గ్రేటర్ హైదరాబాద్, 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మల్కాజిగిరి కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని, వాటికి అనుగుణంగా పోలీస్ కమిషనరేట్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహానగర అభివృద్ధి కోసం చేపట్టిన ఈ వికేంద్రీకరణలో రాజకీయ వివక్షకు తావులేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు సహజమేనని, అయితే అప్పటి వరకు అన్ని రాజకీయ పక్షాలు అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు.



# ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్‌స్‌ను టెస్టుల కోసం పూణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. సీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్‌స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణెలోని ఎనఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్, డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని ఆయన వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వివరాలు అందించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. తప్పు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే విషయాన్ని శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ□యనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మ□డు షిఫ్టుల్లో, 24 గంటలపాటు విమానాశ్రయంలో అందుబాటులో ఉంచి పర్యవేక్షణ, సమాచార సేకరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సంతోష్ చౌహాన్, కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పావని, జీఎంఆర్ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సంజయ్ కుమార్, జీహెచఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారి, ఐడీఎస్‌పీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి డీసీపీ శిల్పవల్లి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాకేశ్ రంజన్, అన్న మేరీ ప్రతినిధులు పాల్గొన్నారు.




# రేవంత్ హిట్లర్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి

గాంధీని టార్గెట్ చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇచ్చే జాతీయ నినాదం "మొహబ్బత్ కీ దుకాన్" కాస్తా, ఆయన స్వయంగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి క్రూర నియంత వారసత్వాన్ని అక్కున చేర్చుకోవడంతో తెలంగాణలో "హిట్లర్ కా మకాన్" (హిట్లర్ ఇల్లు) గా మారిపోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నైతికతలోని ద్వంద్వ ప్రమాణాలను ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ పాలనా విధానాలకు, స్థానిక కూల్చివేతలకు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్, ఆయన "హంతక ముఠా" స్ఫూర్తి అని బహిరంగంగా పేర్కొనడంతో ఈ రాజకీయ వివాదం చెలరేగింది. అంతేకాకుండా, ఈ స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో ఎంతో గర్వంగా పోల్చడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ పరిణామాలపై స్పందించిన కేటీఆర్.. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వారి ఫాసిస్టు పాలనా ఆలోచనా విధానానికి నిదర్శనమని, ఇది దేశ పునాది విలువలపై జరిగిన క్షమించరాని దాడి అని మండిపడ్డారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ వహిస్తున్న వ్యూహాత్మక మౌనాన్ని వీడాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిని మందలించకపోతే, ఆ నియంతృత్వ పద్ధతులను అధిష్టానం సమర్థించినట్లే అవుతుందని హెచ్చరిం చారు. "డియర్ రాహుల్ గాంధీ జీ.. మీ 'మొహబ్బత్ కీ దుకాన్' అధికారికంగా 'హిట్లర్ కా మకాన్' అయిందా..? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్రూర హిట్లర్‌ను కీర్తిస్తూ, అతని 'హంతక ముఠా'లను పాలనా స్ఫూర్తిగా పేర్కొంటుంటే.. మీరు మౌనంగా ఉంటూ, ఢిల్లీలో రాజ్యాంగానికి తానే స్వయంప్రకటిత రక్షకుడినని ఎలా చెప్పుకుంటారు?" అని కేటీఆర్ తన పోస్ట్‌లో నిలదీశారు. ఒక ప్రజాస్వామ్య నాయకుడు నిజమైన రాజనీతిజ్ఞుల నుండి స్ఫూర్తి పొందుతాడని, కేవలం అధికారం తలకెక్కిన, పారనాయిడ్ పాలకుడు మాత్రమే క్రూర నియంతల నుంచి పాఠాలు వెతుక్కుంటాడని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేంద్ర కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలను మరింత తీవ్రం చేస్తూ.. నియంతృత్వ పద్ధతులను పండగ చేసుకోవడం, స్థానిక నివాసాలను యుద్ధ ప్రాంతాలలా మార్చడమే ఆ పార్టీ అసలు సిసలైన పాలనా బ్లూ ప్రింట్ అయితే వారు సిద్ధాంతాల ముసుగును పూర్తిగా తొలగించుకోవాలని కేటీఆర్ సూచించారు. నియంతృత్వ పద్ధతులను సెలబ్రేట్ చేసుకోవడం, స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో గర్వంగా పోల్చడమే మీ పార్టీ అసలు పాలనా విధానం అయితే ఏఐసీసీ తన సిద్ధాంతాల ముసుగును తీసివేసి ఆల్ ఇండియా నాజీ పార్టీగా పేరు మార్చుకోవాలి. మీ మౌనం ఈ వ్యాఖ్యలను అంగీకరించినట్లే అవుతుంది. దేశం మొత్తం మిమ్మల్ని గమనిస్తోంది అని కేటీఆర్ ముగించారు.

# చేప మందు పంపిణీ షురూ

**హైదరాబాద్, జూన్ 8 , ఆశ్వి అప్డేట్:**

చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతోపాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీన్ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ ఉన్నారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం మూడు హెల్త్ క్యాంపస్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా హాస్పిటల్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా మూడు ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు.చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరఫున లక్షకుపైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. ముహూర్తం రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేప మందు పంపిణీ ప్రారంభమైంది. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్ చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యిమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు. సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు.

# బొగ్గు దిగుమతులు తగ్గించే యత్నం

**హైదరాబాద్,జూన్ 8, ఆశ్వి అప్డేట్:**

విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను క్రమంగా తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని 'కాగ్ 'నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైనస్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్‌స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు 80 రోజులకు సరిపడేలా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని అన్నారు. గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్‌స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు. మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ప్రయత్నిస్తు న్నామని వెల్లడించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధికి 2శాతం నిధులు కేటాయించాలని చట్టం చేసినప్పటికీ, ఆ నిధులను జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్లను అడిగితే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సమాధానం వస్తోందని చెప్పారు. సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, గతంలో డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. సింగరేణి ఆర్థిక భారం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని, ఉద్యోగుల కోసం బీమా సదుపాయాలు కూడా తీసుకొచ్చామని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత 12 ఏళ్లలో మోదీ తన పాలనలో ప్రత్యేకమైన ముద్ర వేసారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధితో పాటు సామాజిక సంక్షేమానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.

# సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనాపరమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనిపించే కట్టడాలు మాత్రమే కాదు.. వేలాది మంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలి అడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలి అడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు.

ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఫైనాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్‌లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్‌లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలుగా నిలుస్తాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేర్ అయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోట నుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.110 కోట్లని, ఈ ఏడాదే పనులు వేగంగా జరగడానికి బడ్జెట్‌లోనే రూ.50 కోట్లను కేటాయించినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ ఆర్కిటెక్చర్, బెస్ట్ డిజైన్స్‌తో ఈ భవనాన్ని నిర్మించాల్సిందిగా సంక్షేమ శాఖకు ఆయన సూచించారు. ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచి ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, ఉన్నత ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన కాచిగూడలోని 'నింబోలి అడ్డా హాస్టల్'ను పూర్తిగా ఆధునికీకరించబోతున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లోనే ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ హాస్టల్‌కు 'బాబు జగ్జీవన్ రామ్ నాలెడ్జ్ సెంటర్'గా నామకరణం చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ కూడా విజ్ఞానాన్ని వ్యాప్తి చేసేలా మరొక అద్భుతమైన నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమై ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ పనులన్నింటినీ మరింత మెరుగ్గా ముందుకు తీసుకెళ్లడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలపై మేధావులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు ఎవరైనా సరే తమ విలువైన సలహాలు, సూచనలను నిరభ్యంతరంగా సంక్షేమ శాఖ మంత్రికి ఇవ్వవచ్చని చెప్పారు. ఈ పర్యటనలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, ఇతర సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియ

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వ అప్డేట్:**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ పక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎలఓలు, బీఎలఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్ లు పెట్రోలింగ్ ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎసఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ ఐపీఎస్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎసఐఆర్) పక్రియ ఈనెల 25.06.2026 నుండి ప్రారంభం అవుతుందని, కావున బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, తిరిగి వాటిని సేకరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ ఐ ఆర్ పక్రియలో పాల్గొనే బీఎలఓలు, బీఎలఓ సూపర్‌వైజర్ల పేర్లను, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమన్వయం చేసుకోవడానికి పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లను కూడా ఎన్నికల అధికారులు సేకరించుకోవాలని సూచించారు. ఎసఐఆర్ సర్వే పక్రియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈఓలను ఆదేశించారు. ఈసందర్భంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) శ్రీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎసఐఆర్ విధుల్లో పాల్గొనే అన్ని బీఎలఓలు, ఇతర అధికారులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి సహకారం అందిస్తామని హామీ□ ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచఎంసీ) కమిషనర్, రంగారెడ్డి, మేడ్చల్`మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు / డీఈఓలు, ఆయా జిల్లాల పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ సీఈఓ (ఎఫఏసీ), నోడల్ అధికారులు, పీఎం`ఐటీ, ఇతర సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో మరో వర్కింగ్ ప్రెసిడెంట్..?

**మొదటిపేజీ తరువాయి**

మరింత ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కేటీఆర్‌కు సమాంతరంగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని సృష్టించే అంశాన్ని అధిష్టానం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో జరిగే పార్టీ అధ్యక్ష ఎన్నికల సమయంలోనే ఈ కొత్త నియామకాన్ని ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని ప్రజలకు సందేశం ఇవ్వాలనే లక్ష్యంతో ఈ పదవిని బీసీ నాయకుడికి అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

రాష్ట్రంలో బీసీ రాజకీయాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఆ వర్గాలకు చెందిన నేతకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా రాజకీయంగా లాభం పొందాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కుటుంబ ఆధిపత్యంపై వస్తున్న విమర్శలకు కూడా సమాధానం చెప్పే ప్రయత్నంగా ఈ నిర్ణయం ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పలువురు బీసీ నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. గ్రేటర్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. తలసానితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేర్లు కూడా చర్చలో ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

అయితే కొత్త పదవి ఏర్పాటు, నియామకంపై ఇప్పటివరకు పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అధిష్టానం తుది నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందనే అంశంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

# యూరియా యాప్‌తో రైతులకు మేలు

- **అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి**
- **ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ**



**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వ అప్డేట్:**

రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్ కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు.

దేశవ్యాప్తంగా యూరియా ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. రైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూలైన్లకు చెక్ పెడుతూ రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు.

మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు.

రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్‌నోట్ విడుదల చేసింది.

# మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

- **మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు**
- **సీఎం రేవంత్ సమక్షంలో నేడు అందజేత**

**హైదరాబాద్, జూన్ 8, ఆశ్వ అప్డేట్:**

మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.

అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, భద్రత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే.

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి.

ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరుకానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సీఎస్ పేర్కొన్నారు.

మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూతనిస్తున్నదని అన్నారు.

మహిళల కోసం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేయడానికి ఇక్కడికి వస్తున్నారని సీఎస్ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సీఎస్‌లు వికాస్‌రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, రవాణా కమిషనర్ ఇలంబర్తి, సీఈఓ దివ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, అశోక్‌రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో మరో మెగా రైల్వే కారిడార్

- **రూ.5 వేల కోట్లతో కొత్త రైల్వే లైన్**
- **రామగుండం–మణుగూరు మధ్య ఏర్పాటు**

**తెలంగాణ బ్యూరో, జూన్ 8, ఆశ్వ అప్డేట్:**

తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి, రవాణా రంగానికి ఊతమిచ్చేలా రామగుండం-మణుగూరు నూతన రైల్వే కారిడార్ త్వరలోనే పట్టాలెక్కనుంది. రాష్ట్రంలో ప్రధాన ఆర్థిక హబ్‌గా ఎదిగేందుకు అన్ని అర్హతలున్న ఈ ప్రతిపాదిత రైల్వే లైన్.. సుమారు 200 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. రూ.5 వేల కోట్ల భారీ అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు సరుకు రవాణా, ఇటు ప్రయాణికుల కనెక్టివిటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. ఈ నూతన రైల్వే లైన్ ప్రారంభమైన తొలి రోజుల్లోనే ఏటా దాదాపు రూ.460 కోట్ల ఆదాయాన్ని ఆర్జించొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆపరేషన్ ప్రారంభించిన ఐదేళ్ల వ్యవధిలో.. బొగ్గు, కోక్, ఆహార ధాన్యాలు, సిమెంట్, ఖనిజాలు, ఇతర లోహాల రవాణా ద్వారా ఏటా దాదాపు 12 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరుగుతుందని దీని ద్వారా వార్షిక రాబడి ఏకంగా రూ.720 కోట్లకు చేరుతుందని రైల్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. సరుకు రవాణాతో పాటు, దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణికుల కనెక్టివిటీని మెరుగుపరచడంలో ఈ కారిడార్ కీలక పాత్ర పోషిస్తుంది. ఢిల్లీ-చెన్నై హైడెన్సిటీ రూట్‌లో రామగుండం వ్యూహాత్మకంగా ఉండటం ఈ ప్రాంత ఆర్థిక పురోగతికి మరింత ప్లస్ పాయింట్ కానుంది. ఈ ప్రతిపాదిత లైన్ ద్వారా రామగుండం, భద్రాచలం ప్రాంతాల్లోని సింగరేణి బొగ్గు గనుల బెల్టుల మధ్య ప్రత్యక్ష రైలు మార్గం ఏర్పడనుంది. ప్రస్తుతం కొత్తగూడెం నుండి రామగుండానికి బొగ్గు రవాణా చేయాలంటే అత్యంత రద్దీగా ఉండే డోర్నకల్-వరంగల్-రామగుండం సెక్షన్ మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ఇది న్యూఢిల్లీ-చెన్నై హైడెన్సిటీ కారిడార్‌లో భాగం కావడంతో ఆలస్యమవుతోంది.

**తగ్గనున్న దూరభారం.!**

ప్రస్తుతం ఉన్న ఈ పాత రూట్ కంటే కొత్తగా ప్రతిపాదించిన 207 కిలోమీటర్ల రామగుండం–మనుగూరు బొగ్గు కారిడార్ ఏకంగా 150 కిలోమీటర్ల దూరాన్ని తగ్గిస్తుంది. ఈ షార్ట్ రూట్ వల్ల రవాణా సమయం కలిసిరావడమే కాకుండా నిర్వహణ సామర్థ్యం పెరిగి లాజిస్టిక్స్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఇప్పటికే పూర్తయి కేంద్ర ప్రభుత్వ తుది ఆమోదం కోసం వేచి ఉంది. భూసేకరణకు పట్టే ఒక ఏడాదితో కలిపి, మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి న్యూఢిల్లీ వైపు వెళ్లే పలు రైళ్లు భద్రాద్రి కొత్తగూడెం మీదుగా ప్రయాణించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇది ప్రాంతీయ కనెక్టివిటీని మార్చడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది.

# గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి పూర్తి పారదర్శకత పాటించాలి

**మొదటిపేజీ తరువాయి**

గారు స్పష్టం చేశారు. జూన్ విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సవి□క్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అయితే సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు. ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట పక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వంటశాలలు, స్టోర్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. అకడమిక్ పరంగా ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సవి□క్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయ□ఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశాల పక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం లేదా అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, విద్యుత్ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, హాస్టల్ గదులు, వంటశాలలు, మరుగుదొడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. □`రతి విద్యార్థిని తమ సొంత పిల్లలుగా భావించి చూసుకోవాలని మంత్రి సూచించారు. వారి విద్యా ప్రగతి మాత్రమే కాకుండా ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. గురుకులాలు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే కేంద్రాలు కాకుండా, సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేసే సంస్థలుగా నిలవాలని పేర్కొన్నారు. పాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. సిబ్బంది సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పరిపాలనా సమస్యలపై సంస్థ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హావి□ ఇచ్చారు. సిబ్బంది సంతృప్తి, విద్యార్థుల విజయానికి పరస్పర సంబంధం ఉందని, అందుకే ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణ గురుకులాలను దేశంలోనే అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆరఈఐఎస్ కార్యదర్శి (ఎఫఏసీ) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి. శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ (అకౌంట్స్) చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ & మీడియా అధికారిగా మంజుల

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 08 :**



రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నూతన జిల్లా మాస్ ఎడ్యుకేషన్ & మీడియా అధికారి బాధ్యతల స్వీకరణ రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో నూతనంగా నియమితులైన జిల్లా మాస్ ఎడ్యుకేషన్ & మీడియా అధికారి శ్రీమతి జి. మంజుల గారు ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వచ్చిన శ్రీమతి జి. మంజుల గారు, ఇప్పటివరకు ఈ బాధ్యతలను నిర్వహించిన శ్రీ కె. శ్రీనివాసులు గారి నుండి బాధ్యతలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది నూతన అధికారిని ఆత్మీయంగా స్వాగతించారు. ప్రజారోగ్య కార్యక్రమాల ప్రచారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సమాచార వ్యాప్తి, మీడియా సమన్వయం మరియు ప్రజలకు ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సమర్థవంతంగా చేరవేయడంలో జిల్లా మాస్ ఎడ్యుకేషన్ & మీడియా అధికారి కీలక పాత్ర పోషిస్తారని అధికారులు పేర్కొన్నారు. శ్రీమతి జి. మంజుల గారు మాట్లాడుతూ, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి గారి మార్గదర్శకత్వంలో ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా తల్లిశిశు ఆరోగ్యం, టీకా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు, కార్యక్రమ నిర్వాహకులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్..

**నల్లగొండ, ఆశ్వి అప్డేట్**

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను ఓర్పుగా విన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 43 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును జాగ్రత్తగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి కేసుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. భూమి వివాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలు, దాడులు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారించి, బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీస్ శాఖను ఆశ్రయించాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

## ప్రజావాణికి 121 ఫిర్యాదులు

**రంగారెడ్డి, ఆశ్వి అప్డేట్**



రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 94 దరఖాస్తులు అందగా, మొత్తం 121 ఫిర్యాదులు నమోదయ్యాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహేశ్వరం కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం

**ఆశ్వి అప్డేట్**

ఈ నెల 10వ తేదీన ఫ్యూచర్ సిటీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడమే లక్ష్యంగా,మహేశ్వరం నియోజకవర్గ రామకృష్ణ పురం డివిజన్, ఎన్టీఆర్ నగర్ డివిజన్, సరూర్నగర్ డివిజన్, డాక్టర్స్ కాలనీ డివిజన్ల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం కొత్తపేటలోని 'పాపడం బ్లూ' హోటల్‌లో సభ అధ్యక్షులు పూన్న గణేష్ నేత, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం ఈ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే *కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ *దేప భాస్కర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని మహేందర్ యాదవ్ పాల్గొన్నారు *

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా డెవలప్మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్సిటీల ప్రారంభోత్సవానికి తరలివస్తున్న ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. 10వ తేదీన జరిగే ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఏం సి డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ధనరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# హత్య కేసును ఛేదించిన మక్తల్ పోలీసులు ముగ్గురు నిందితుల అరెస్ట్

**ఆశ్విఅప్డేట్:**
**నారాయణపేట జూన్ 08**

నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నారాయణపేట డీఎస్పీ శ్రీ నల్లపు లింగయ్య ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. తేదీ 03.06.2026న సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో మరికల్ మండల కేంద్రానికి చెందిన బోడి రాజు (44)ను నిందితులు అల్లెం నాగరాజు, సిరిగిరి భాను ప్రకాష్, ఆనంపల్లి భాస్కర్‌లు ముందస్తు పథకం ప్రకారం తమ వెంట తీసుకెళ్లారు. మృతుడు బోడి రాజు పేరుపై సుమారు రూ.50 లక్షల విలువైన జీవిత బీమా (ఇన్సూరెన్స్) పాలసీ ఉండటంతో, ఆ డబ్బును పొందాలనే ఉద్దేశంతో నిందితులు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది. పథకం ప్రకారం మృతుడికి అధికంగా మద్యం తాగించి



సామన్‌పల్లి గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, అక్కడ కట్టెలు మరియు రాళ్లతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నంలో భాగంగా గాయపడిన బోడి రాజును భాను ప్రకాష్‌కు చెందిన కారులో హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తదుపరి నిందితులు మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, దండు చౌరస్తా సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిందని, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినప్పటికీ మరణించినట్లు తప్పుడు సమాచారం అందించారు.

ఈ మేరకు తేదీ 04.06.2026న మృతుడి కుటుంబ సభ్యులు మక్తల్ పోలీస్ స్టేషన్‌లో రోడ్డు ప్రమాద మరణంగా ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా మక్తల్ ఎస్సై రాజు వాహనదారుడైన సిరిగిరి భాను ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, దండు చౌరస్తా వద్ద ఎటువంటి రోడ్డు ప్రమాదం జరగలేదని తేలింది. దీంతో నిందితులను లోతుగా విచారించగా హత్య కుట్ర వెలుగులోకి వచ్చింది అని తెలిపారు. ఈ కేసులో అల్లెం నాగరాజు (33), సిరిగిరి భాను ప్రకాష్ (26), ఆనంపల్లి భాస్కర్ (30)లను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును వేగంగా ఛేదించి వాస్తవాలను వెలికితీసిన మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై రాజు, ASI శంకరయ్య కానిస్టేబుల్ అశోక్, నరేష్, శ్రీకాంత్ మరియు దర్యాప్తు బృందంలోని పోలీసు అధికారులను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# మానవత్వాన్ని చాటుకున్న చెలిమి ఫౌండేషన్

- **చెలిమి ఫౌండేషన్ 87వ సహాయ కార్యక్రమం**
- **బాధితుడికి రూ. 40,000 ఆర్థిక సహాయం**

**గజ్వేల్, జూన్ 08 (ఆశ్వి అప్డేట్స్)**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన, ప్రస్తుతం గజ్వేల్ పట్టణంలో నివాసముంటున్న బైక్ మెకానిక్ తూం దేవేందర్ వైద్య ఖర్చుల నిమిత్తం "చెలిమి ఫౌండేషన్" మరియు వారి మిత్రుల బృందం అండగా నిలిచి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. దేవేందర్ వృత్తిరీత్యా బైక్ మెకానిక్ గా జీవనం సాగిస్తున్నారు. గతంలో ఆయనకు గుండె శస్త్రచికిత్స (హార్ట్ సర్జరీ) జరగడంతో నిరంతరం మందులు వాడుతున్నారు. అయితే, ఇటీవల ఆయన ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టడం (బ్లడ్ క్లాట్) జరిగింది. దీంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయన్ను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అక్కడ ఆయన చికిత్స పొందుతున్నారు. ఈ చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటం, దేవేందర్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న "చెలిమి ఫౌండేషన్" వెంటనే స్పందించింది. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు చెలిమి ఫౌండేషన్ తరపున రూ. 15,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. దీనికి తోడు చెలిమి ఫౌండేషన్



మిత్రులు ప్రత్యేకంగా స్పందించి, తమ వంతుగా మరో రూ. 25,000 విరాళాలను సేకరించారు. మొత్తంగా సేకరించిన రూ. 40,000 ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు దేవేందర్ కుటుంబ సభ్యులను నేరుగా కలిసి, వారిని పరామర్శించి అందజేశారు. ఈ కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, యాట ఆంజనేయులు,పెద్దూరి శ్రీనివాస్, టెంటు మెతుకు నర్సింలు, చేపూరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## "మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ" – మాజీ మంత్రి విడదల రజిని గారు

**చిలకలూరిపేట, జూన్ 8, ఆశ్వి అప్డేట్:**

మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి పిలుపు మేరకు "వెన్నుపోటుకి రెండేళ్లు" కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని గారి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. చిలకలూరిపేటలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా నల్ల బెలూన్లను ఎగురవేసి నిరసన తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రజలకు చేసిన వాగ్దానాలు, అమలు చేయని పథకాలపై ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. అనంతరం చర్చా వేదిక ద్వారా ప్రభుత్వ వైఫల్యాలపై నాయకులు మాట్లాడారు. మాజీ మంత్రి విడదల రజిని గారు మాట్లాడుతూ, "మెగా డీఎస్సీ పెట్టామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. కానీ ఇది మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ" అని విమర్శించారు. డీఎస్సీ పరీక్షలు రాసిన




లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలతో ప్రభుత్వం ఆటలాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెరిట్‌కు విలువ లేకుండా అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందనే ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తున్నాయని అన్నారు. నియామకాలపై ఇన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. తప్పు చేయకపోతే స్వతంత్ర దర్యాప్తుకు ఎందుకు భయపడుతోందని నిలదీశారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రజిని గారు విమర్శించారు. పారదర్శకత ఉంటే మొత్తం ఎంపిక ప్రక్రియను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఒక ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి కష్టపడిన నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదన్నారు. డీఎస్సీ వ్యవహారంలో పూర్తి నిజాలు వెలుగులోకి వచ్చే వరకు వైయస్ఆర్సీపీ నిరుద్యోగ యువత పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అలాగే జగన్ మోహన్ రెడ్డి గారి కన్నా ఎక్కువ సంక్షేమం ఇస్తామని ఎన్నికల సమయంలో ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు అమలులో ఎక్కడా కనిపించడం లేదని, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు కూటమి పాలనతో తీవ్ర నిరాశకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మండల మరియు పట్టణ కన్వీనర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్**

హైదరాబాద్..రూ.110 వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ఇద్దరు డెలివరీ బాయ్‌స్‌ను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేశారు అని సికింద్రాబాద్ డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి తెలిపారు.

నిందితులను ధబీ వినోద్, మక్కల మోహన్‌గా గుర్తించారు. మృతుడు ప్రకాశ్ దేశ్‌ముఖ్ మధ్య ప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లా కినాపూర్ తహసీల్‌కు చెందినవాడిగా పోలీసులు తెలిపారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం, ఈ హత్య లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దర్యాప్తులో భాగంగా నిందితుల వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన ఎలక్ట్రిక్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వినోద్‌పై మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2021లో కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు మోహన్‌కు గత నేరచరిత్ర లేదని వెల్లడించారు.




ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## POCSO కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష

**ఆశ్వి అప్డేట్స్ హయత్‌నగర్, జూన్ 08:***

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019 సంవత్సరంలో నమోదైన క్రైం నెం.638/2019, సెక్షన్లు 417, 376 ఐపీసీ మరియు POCSO చట్టం సెక్షన్4 కింద నమోదు చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గౌరవనీయ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఫర్ ఎక్స్‌పిడిషియస్ ట్రయల్ అండ్ డిస్పోజల్ ఆఫ్ రేప్ అండ్ POCSO యాక్ట్ కేసెస్, రంగారెడ్డి జిల్లా, ఎల్.బి.నగర్ న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. కేసు వివరాల ప్రకారం, మేఘావత్ శ్రీకాంత్, తండ్రి లేట్ లచిరామ్, వయస్సు 25 సంవత్సరాలు, వృత్తి బస్సు డ్రైవర్, బండ్లగూడ బస్ డిపో, నివాసం ఆనంద్‌నగర్, నాగోల్, స్వస్థలం పి.సి.తండా, మంచాల్ మండలం, రంగారెడ్డి జిల్లా, ఓ మైనర్ బాలికను మోసపూరితంగా నమ్మించి లైంగికంగా దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తు మరియు విచారణలో రుజువైంది. ఈ కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, వైద్య ఆధారాలు, బాధితురాలి వాంగ్మూలం మరియు ఇతర సాక్ష్యాలను పరిశీలించిన అనంతరం గౌరవనీయ న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి *10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.6,000/ జరిమానా విధించింది.* అదేవిధంగా బాధితురాలికి *రూ.1,00,000/ బాధిత పరిహారం (Victim Compensation)* మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసును అప్పటి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. సతీష్ కుమార్ (ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు) సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై పటిష్టమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ప్రవేశపెట్టడం ద్వారా శిక్ష పడేలా కీలక పాత్ర పోషించారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి, లాంగ్ పెండింగ్ కేసులను క్లియర్ చేయాలి

- **DCRB డీఎస్పీ మహేష్**
- **డీఎస్పీ నల్లపు లింగయ్య.**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 8**

నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నేడు డీఎస్పీ లు మహేష్, లింగయ్య ఆధ్వర్యంలో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో లాంగ్ పెండింగ్ కేసులు వెంటనే క్లియర్ చేయాలని, కేసుల దర్యాప్తు నాణ్యత, నేరల నియంత్రణ పై చర్యలు తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలి అని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ లు మాట్లాడుతూ... ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం



చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు, అవి నిరంతరం పనిచేసే విధంగా మానిటర్ చేయాలని సూచించారు. దొంగతనల కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి లాంగ్ పెండింగ్ కేసులలోని నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. విలేజ్ పోలీసు అధికారులు గ్రామలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా పోలీస్ వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించాలనీ, ప్రతి అధికారి తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతంలో నేరాలు జరగకుండా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో CI లు భగవంత్ రెడ్డి, సైదులు ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్‌రెడ్డి SM నవీద్, రాజు, అశోక్ బాబు, రాజు, బాలరాజు, రమేష్, రాము, రాజశేఖర్, రమేష్, పురుషోత్తం, నరేష్, సునీత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ దశాబ్ది



- ఆశ్వి అప్డేట్స్ తెలంగాణ బ్యూరో జూన్ 08:

జగత్ ప్రకాశ్ నడ్డా  ప్రతి సురక్షిత గర్భస్థ దశ మహిళలపై దేశానికిగల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఏటా దాదాపు 2.9 కోట్ల మంది మహిళలు గర్భందాల్చే దేశంలో, సురక్షిత మాతృత్వానికి భరోసా ఇచ్చే పటిష్ట ఆరోగ్య వ్యవస్థలు, సకాలంలో కార్యకలాపాలు, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవల సమాన లభ్యత సహా నిరంతర రాజకీయ నిబద్ధత అత్యావశ్యకం.

ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా గడచిన దశాబ్ద కాలంలో ప్రసూతి మరణాల శాతం గణనీయంగా తగ్గింది. ప్రజారోగ్యం రంగంలో భారత్ సాధించిన అత్యంత కీలక ఇదొకటి. ఈ క్రమంలో తల్లుల ఆరోగ్య పరిరక్షణ కు నిరంతర పెట్టుబడులు, సేవా వ్యవస్థల బలోపేతం, సామాజిక భాగస్వామ్యం గత పదేళ్లుగా ప్రత్యక్ష నిదర్శనాలు. ప్రతి మహిళా గర్భస్థ దశను సురక్షితంగా అధిగమించడంలో నాణ్యమైన సంరక్షణ సౌలభ్యంపై నిరంతర నిబద్ధత కూడా ఈ పురోగమనానికి మూలం. ఈ పరిణామాత్మక మార్పులకు పునాది వేసింది ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఎ). దేశవ్యాప్తంగా సురక్షిత మాతృత్వానికి చేయూత నివ్వడంలో ఈ కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మానస పుత్రికగా ఈ పథకం 2016 జూన్ 9న ఓ జాతీయ ఉద్యమం తరహాలో శ్రీకారం చుట్టుకుంది. ప్రతి మహిళ గర్భస్థ దశలోని 2వ, 3వ త్రైమాసికాలలో ప్రతి నెలా 9వ తేదీన ఉచితంగా, సమగ్రనాణ్యమైన ప్రసవపూర్వ సంరక్షణ సేవలందించడం ఈ పథకం పరమోద్దేశం. ఈ సహాయం అందించడం కోసం లో 9వ తేదీని ఎంచుకోవడానికి ఒక లోతైన కారణం ఉంది. గర్భస్థ దశ అనే 9 నెలల అమూల్య ప్రస్థానం ఆద్యంతం నెలకొక కొత్త ఆశ.. ఎదురుచూపు.. బాధ్యతలను మోసుకొస్తుంది. కాబట్టే, ప్రతి నెలలో 9వ రోజును మాతృ శ్రేయస్సుకు అంకితం చేయడం ద్వారా ఆరోగ్యకర నవజాత శిశు సురక్షిత జననానికి భరోసా ఇవ్వాలన్నదే అంతరార్థం. ఈ తొమ్మిది నెలల పాటు ప్రతి గర్భిణికీ నిరంతర సంరక్షణ, పర్యవేక్షణ, అండదండలు అవశ్యమని 'పీఎంఎస్ఎంఎ' గుర్తు చేస్తుంది.

ఏ మహిళకైనా గర్భస్థ దశ పూర్తి ప్రమాద రహితమని భావించే వీల్లేదన్నది మాతృ ఆరోగ్య సంరక్షణలో గుర్తుంచుకోవాల్సిన తొలి ప్రధానాంశం. ఇవాళ అంతా సజావుగానే ఉందనే పరిస్థితి రేపటికి తీవ్ర సమస్యకు దారితీయవచ్చు. అందువల్ల గర్భస్థ దశలో ఎప్పుడైనా ఎలాంటి హెచ్చరిక లేని అధిక ముప్పు వాటిల్లవచ్చుననే స్పృహతో 'పీఎంఎస్ఎంఎ' పనిచేస్తుంది. ఆ మేరకు ముప్పును ముందుగానే గుర్తించడం, దానిపై నిశిత పర్యవేక్షణ, సకాలంలో నిపుణులతో సంప్రదింపుల ద్వారా తగు చర్యలు చేపట్టేలా చూస్తుంది. తద్వారా ఒక సరళ, విప్లవాత్మకమైన విధానాన్ని ఈ పథకం రూపంలో ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రమాదకర గర్భస్థ దశను గుర్తించినపుడు తల్లి మరణం, మృతశిశు జననం, లోపాలతో నవజాత శిశు జననం లేదా జీవితకాల వైకల్యం ముప్పు తదితరాల నివారణకు ఇదొక అవకాశమిస్తుంది. సమస్యల నివారణ నుంచి అవసరమైన చికిత్స వైపు దృష్టి మళ్లించడం ద్వారా భారత మాతృ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తూ కోట్లాది మహిళలకు గర్భస్థ దశను సురక్షితంగా అధిగమించేలా చేయూతనిస్తోంది. దేశవ్యాప్తంగా మాతృ ఆరోగ్య సేవలలో అంచనా సామర్థ్యం, జవాబుదారీతనం, నిరంతర సౌలభ్యంతోపాటు నిపుణుల నేతృత్వాన ప్రసవ పూర్వ సంరక్షణకు నిర్దిష్ట రోజు, హామీ సహిత సంస్థాగత వేదికను సమకూర్చడం 'పీఎంఎస్ఎంఎ' విశిష్టతలలో ఒకటి. గర్భిణులలో తీవ్ర రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భస్థదశ మధుమేహం, ఇన్ఫెక్షన్లు వంటివాటిని గుర్తించలేని పక్షంలో తల్లితోపాటు నవజాత శిశువు మనుగడకు ముప్పు వాటిల్లవచ్చు. కాబట్టి, వీటితోపాటు మొత్తం అధిక ముప్పుగల 25 సమస్యలను గుర్తించేందుకు ఈ పథకం కింద గర్భిణులకు వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం కింద ఓ నిపుణుడు లేదా వైద్యాధికారి ద్వారా సాధారణ ప్రసవపూర్వ సంరక్షణ పరీక్షలతోపాటు అధిక ముప్పున్న వారి విషయంలో నిరంతర పర్యవేక్షణ అవసరమని అనేక అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. కాబట్టే, కేంద్ర ప్రభుత్వం 2022లో 'విస్తృత పీఎంఎస్ఎంఎ' వ్యూహాన్ని అమలులోకి తేవడం ద్వారా పథకాన్ని మరింత బలోపేతం చేసింది.

దీనికింద అధిక ముప్పున్న గర్భిణులకు సురక్షిత ప్రసవం అయ్యేదాకా సకాలంలో పరిస్థితుల సముచిత నిర్వహణకు భరోసా ఇస్తూ సాధారణ 'పీఎంఎస్ఎంఎ' చర్యలకు అదనంగా ఆస్పత్రి లేదా వైద్యుల సందర్శనల సౌలభ్యాన్ని పొందుపరిచారు. అధిక ముప్పుగల గర్భిణులను పేరు ఆధారంగా గుర్తించి, ప్రసవానంతరం 45వ రోజు దాకా పర్యవేక్షణ యంత్రాంగాలను బలోపేతం చేయడం వంటి చర్యలను అమలులోకి తెచ్చారు.

దీనివల్ల గర్భస్థ దశలోనే కాకుండా ప్రసవానంతర తక్షణ కాలంలోనూ బలహీన మహిళలు నిరంతర వైద్య సంరక్షణలో ఉండేలా ఇది వీలు కల్పిస్తుంది. అధిక ముప్పుగల గర్భిణుల వైద్య పరీక్షల కోసం తోడుగా వెళ్లే గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్త (ఆశా)లకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా 'రెఫరల్ సమ్మతి'తోపాటు సంరక్షణ కొనసాగింపు మరింత బలోపేతమైంది. కార్యక్రమం అమలు, పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత 'పీఎంఎస్ఎంఎ' డిజిటల్ పోర్టల్‌ను రూపొందించింది. దేశవ్యాప్తంగా కార్యక్రమం సజావుగా సాగడంలో ఇది నేడు వెన్నుదన్నుగా నిలుస్తోంది. సేవల ప్రదానంపై ప్రత్యక్ష నివేదన, పేరు ఆధారంగా అధిక ముప్పుగల గర్భిణుల గుర్తింపు, కార్యక్రమ పనితీరుపై పర్యవేక్షణ సహా కేంద్ర, రాష్ట్ర స్థాయులలో నిదర్శనాధారిత నిర్ణయాత్మకతకు ఈ పోర్టల్ వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా ప్రైవేట్ రంగ నిపుణుల, సామాజిక స్వచ్ఛంద కార్యకర్తల నమోదుతో ద్వారానూ ఈ కార్యక్రమానికి వారి సహకారం పొందడంలో ఈ వేదిక తోడ్పడుతుంది. తద్వారా గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిత 'జన భాగస్వామ్యం' దృక్కోణాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుంది. జాతీయ స్థాయిలో మాతృ ఆరోగ్య వ్యవస్థ అంతటా సమన్వయానికిగల ప్రాధాన్యాన్ని కూడా 'పీఎంఎస్ఎంఎ' విజయం స్పష్టం చేస్తోంది. ఆ మేరకు జననీ సురక్ష యోజన (జేఎస్‌వై), జననీ శిశు సురక్ష కార్యక్రమం (జేఎస్ఎస్‌కే), సురక్షిత్ మాతృత్వ ఆశ్వాసన్ (సుమన్), నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్), పోషణ్ అభియాన్, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) ఆయుష్మాన్ భారత్‌మిడ్‌వైఫరీ సర్వీసెస్, ఆప్టిమైజేషన్ ఆఫ్ పోస్ట్ నేటల్ కేర్ (ఓపీఎన్‌సీ) వంటి కార్యక్రమాలతో 'పీఎంఎస్ఎంఎ' సమన్వయ ప్రాధాన్యం తేటతెల్లమైంది. ఆ విధంగా గర్భం, ప్రసవం, ప్రసవానంతర కాలమంతటా మహిళలకు బలమైన, నిరంతర సంరక్షణ వలయం రూపొందించడంలో ఎంతగానో దోహదం చేసింది. దేశంలోని ముందువరుస ఆరోగ్య కార్యకర్తలు.. అంటే గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య (ఆశా), అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు సహాయక నర్సు మిడ్‌వైఫ్‌లు, సామాజిక ఆరోగ్యాధికారులు, నర్సులు, మిడ్‌వైఫ్‌లు, వైద్యాధికారులు ఈ పరిణామాత్మక మార్పులకు మూలస్తంభాలు. 'సామాజిక సమీకరణ, కౌన్సెలింగ్, స్క్రీనింగ్, రెఫరల్, ఫాలో అప్' ప్రక్రియలలో వారి అవిరళ కృషి ఫలితంగా దేశంలోని అత్యంత మారుమూల, వెనుకబడిన ప్రాంతాల్లోని మహిళలకు మాతృ ఆరోగ్య సేవలు లభిస్తున్నాయి. ఈ సామూహిక కృషి ప్రభావం జాతీయ ఆరోగ్య ఫలితాలలో స్పష్టంగా ద్యోతకమవుతోంది. తాజా శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్2022-24 అంచనాల ప్రకారం... దేశంలో మాతృ మరణాల నిష్పత్తి ప్రతి లక్ష జననాలకు 87కి దిగివచ్చింది. ఇదే స్ఫూర్తితో దీన్ని 2030కల్లా 70కన్నా దిగువకు తేవాలనే సుస్థిర ప్రగతి (ఎస్‌డీజీ) లక్ష్య సాధనకు దేశం నేడు అత్యంత చేరువలో ఉంది. దేశం సాధించిన ఈ విజయాలన్నిటినీ విస్తృత మాతృ ఆరోగ్య సూచీలన్నీ ప్రతిబింబిస్తున్నాయి. ఇటీవలి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్6, 202324) ప్రకారం మునుపటి (ఎన్ఎఫ్‌హెచ్ఎస్5, 201921) సర్వేతో పోలిస్తే సంస్థాగత ప్రసవాలు 88.6 శాతం నుంచి 90.6 శాతానికి పెరిగాయి. అలాగే ప్రసవపూర్వ సంరక్షణ విస్తృతి ఎన్ఎఫ్‌హెచ్ఎస్5 ప్రకారం 92.6 శాతం కాగా, ఎన్ఎఫ్‌హెచ్ఎస్6లో మెరుగుపడి 95.9 శాతానికి చేరింది. మునుపటితో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువ సంఖ్యలో మహిళలు అత్యావశ్యక మాతృ ఆరోగ్య సేవలర పొందుతున్నారని ఈ విజయాలు రుజువు చేస్తున్నాయి. సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో చర్యలు చేపట్టే అమూల్య అవకాశం మెరుగుపడిందని స్పష్టం చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచంలో అతిపెద్ద వార్షిక జననాల భారాన్ని నిభాయిస్తూనే ఇంతటి పురోగమనం సాధించడమన్నది భారత మాతృ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల స్థాయిని, ప్రభావాన్ని స్పష్టం చేస్తోంది.

**ఒక దశాబ్దపు ప్రభావం**

గడచిన దశాబ్ద కాలంలో 'పీఎంఎస్ఎంఎ' అసాధారణ స్థాయివిస్తరణను నమోదు చేసింది. దేశవ్యాప్తంగా 2016లో ప్రారంభమైన ఈ కార్యక్రమం కింద 7.5 కోట్లకు పైగా ప్రసవ పూర్వ పరీక్షలు క్రమం తప్పకుండా కొనసాగాయి. ముఖ్యంగా 1.17 కోట్ల మందికిపైగా మహిళల్లో అధిక ముప్పుగల గర్భస్థ దశలను గుర్తించే వీలు కలిగింది. ఈ కార్యక్రమం సాధించిన విజయాలు కేవలం గణాంకాలకు పరిమితం కాదు. సకాలంలో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా గర్భిణుల సమస్యలను ముందుగానే గుర్తించి, నిశిత పర్యవేక్షణతో వారి ప్రాణరక్షణతోపాటు నవజాత శిశు ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో లక్షలాది తల్లుల ఆశీస్సులను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. ప్రతి మహిళకూ గర్భస్థ దశ ఒక ఆశావహ ప్రస్థానం... ప్రతి కుటుంబంలో ఓ నవ్యారంభానికి వాగ్దానం. కానీ, ప్రపంచవ్యాప్తంగా ఎందరో మహిళలు గర్భస్థ దశలో నివారించగలిగనవే అయినా, అనేక ముప్పులను ఎదుర్కొంటూనే ఉన్నారు. బిడ్డకు జన్మనిచ్చే క్రమంలో ఏ తల్లీ తన ప్రాణం కోల్పోరాదు... నివారించగల గర్భస్థ దశ సమస్యల వల్ల ఏ కుటుంబమూ తమ ఇంటి దీపాన్ని నష్టపోరాదనే సరళ, దృఢ విశ్వాసమే పునాదిగా 'పీఎంఎస్ఎంఎ' రూపొందింది. దేశం ఇవాళ నిర్వహించుకుంటున్న 'పీఎంఎస్ఎంఎ' దశాబ్ది ఉత్సవం ఒక ప్రజారోగ్య కార్యక్రమ విజయానికి పరిమితమనది కాదు. లక్షలాది మహిళల గర్భస్థ దశ సంరక్షణ, ఆరోగ్యకర మాతృమూర్తులు, బలమైన నవజాత శిశు జీవనారంభం సహా ఈ పరిణామాత్మక మార్పులకు దోహదకారులైన ఆరోగ్య కార్యకర్తలు, సమాజాలు, కుటుంబాల సమష్టి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ వేడుక చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో మన ముందున్న మార్గం సుస్పష్టం... నాణ్యమైన ప్రసవపూర్వ సంరక్షణ, అధిక ముప్పుగల గర్భస్థ దశల పర్యవేక్షణ, మంత్రసానుల నేతృత్వాన సేవలు, డిజిటల్ ఆవిష్కరణలు సహా మాతృ ఆరోగ్య సంరక్షణ సేవల సమాన లభ్యతను బలోపేతం చేస్తూనే ఉండాలి. ఈ క్రమంలో 'పీఎంఎస్ఎంఎ' విజయం ఒక సార్వత్రిక సత్యాన్ని చాటిచెప్పింది. ప్రతి గర్భానీ పర్యవేక్షిస్తూ, ప్రతి ముప్పును ముందుగానే గుర్తించడం ద్వారా ప్రతి మహిళకూ సకాలంలో, గౌరవప్రద, నాణ్యమైన సంరక్షణ లభించేలా చూసినప్పుడు అనివార్య మాతృ మరణాల నిరోధం కూడా సాధ్యమేనని స్పష్టం చేసింది. అందువల్లనే 'పీఎంఎస్ఎంఎ' పదేళ్లు పూర్తి చేసుకోవడం ఓ కార్యక్రమ విజయోత్సవానికి పరిమితమయ్యే అంశం కాదు. ప్రతి తల్లి ప్రాణం నిలవాలని, ప్రతి నవజాత శిశువు ఆరోగ్యంగా ఎదగాలన్నదే నిర్దిష్ట లక్ష్యం. ఆ మేరకు రాజకీయ నిబద్ధత, సాధికార క్షేత్రస్థాయి కార్యకర్తలు, డిజిటల్ ఆవిష్కరణలు, సామాజిక భాగస్వామ్యం, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు ఏకమైతే ఎంతటి ఘన విజయం సాధ్యమో ఈ కార్యక్రమం తేటతెల్లం చేసింది.

## టీజీ 20 కి ఎంపికైన హిషాంత్ ను సన్మానించిన రామాయంపేట సిఐ సైదా

**గజ్వేల్ జున్ 08, (ఆశ్వి అప్డేట్స్)**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన బాకీ స్వామి లావణ్య దంపతుల కుమారుడు హిశాంత్ టీజీ 20 (తెలంగాణ క్రికెట్ ప్రీమియర్ లీగ్ టి 20) హైదరాబాద్ ఛాంపియన్ జట్టుకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్ లో సోమవారం బాకీ హిషాంత్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన రామాయంపేట సిఐ సైదా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకుంఠిత పట్టుదల క్రీడా స్ఫూర్తితో క్రికెట్లో రాణిస్తూ టీజీ 20 కి హిశాంత్ సెలెక్ట్ కావడం సంతోషంగా ఉందని వారికి క్రికెట్లో మంచి భవిష్యత్తు ఉన్నదని గజ్వేల్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ హిశాంత్ క్రీడల్లో రాణించడానికి వారి తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందని కొనియాడారు ఈ కార్యక్రమంలో, బాకీ స్వామి లావణ్య దంపతులు తదితరులు పాల్గొన్నారు





## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 8**

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో ఈనెల 14న నారాయణపేటలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు. మోహాశిన్ ఏ ఆజం ఫౌండేషన్ మహబూబ్ నగర్ శాఖ శంకర ఐ హాస్పిటల్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న పట్టణంలోని గ్రీన్ వుడ్ స్కూల్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి శుక్లాల ఉచిత ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ తరపున అబ్దుల్ రహీం మహమ్మద్ మునీర్ మహమ్మద్ సాజిద్ సద్రుద్దీన్ చాంద్ తదితరులు పాల్గొన్నారు..

# తూతూమంత్రంగా 'బడిబాట'!

- ఫోటోలకు పోజులు.. ఆపై ఇంటి బాట
- గ్రామాల్లో 'ప్రైవేటు' జోరు.. పట్టించుకోని సర్కారు సార్లు
- ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారా..? లేరా..? అని ప్రశ్నిస్తున్న జనం
- జగదేవపూర్ మండలంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ

**జగదేవపూర్, జూన్ 8**
**(ఆశ్వి అప్డేట్స్ )**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా 'బడిబాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జూన్ 3వ తేదీ నుంచి 15 వరకు ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉదయం పూట టిఫిన్స్, స్నాక్స్ వంటి పథకాలను ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు క్షుణ్ణంగా వివరించాల్సి ఉంది. తద్వారా పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా చొరవ చూపాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. కానీ, జగదేవపూర్ మండలంలోని కొందరు ఉపాధ్యాయులు మాత్రం ప్రభుత్వ ఆశయాలను తుంగలో తొక్కుతున్నారు.

**-సోషల్ మీడియా ఆర్భాటమే తప్ప.. క్షేత్రస్థాయిలో శూన్యం!**

మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కేవలం 'ఫోటోల'కే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఉపాధ్యాయులు తమకు ఇష్టం వచ్చిన సమయంలో పాఠశాలలకు వస్తూ, పట్టుమని పది నిమిషాలు కూడా ప్రచారంలో పాల్గొనడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో 'బడిబాట' ఫ్లెక్సీల ముందు నిలబడి ఆర్భాటంగా ఫోటోలకు పోజులిస్తూ.. వాటిని వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా గ్రూపుల్లో అప్‌లోడ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. "హమ్మయ్య.. ఈ రోజుకు మా డ్యూటీ అయిపోయింది" అన్నట్లుగా మరుక్షణమే ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నారు.

**-ప్రభుత్వ పథకాలపై కరవైన ప్రచారం**

ఏ ఒక్క రోజు కూడా గ్రామాల్లోని వీధుల్లో తిరిగి, ప్రభుత్వ పాఠశాలల్లో లభించే ఉచిత విద్యా సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించిన పాపాన పోవడం లేదు. దీంతో గ్రామాల్లో అసలు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారా? లేరా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**సొంత ప్రైవేటు పాఠశాలలపైనే సార్ల మక్కువ?**

మరోవైపు, కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ స్వలాభం కోసం తెరవెనుక సొంతంగా ప్రైవేటు పాఠశాలలను నడుపుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ.. తమ సొంత ప్రైవేటు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవడానికి చూపిస్తున్న శ్రద్ధను, ప్రభుత్వ పాఠశాలలపై చూపించడం లేదని పలువురు వాపోతున్నారు. ఫలితంగా గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలల జోరు పెరిగి, పేద ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి.



**విద్యాశాఖ అధికారులు స్పందించేనా...?**

ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలను పెంచి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, విద్యాశాఖ స్పందించి.. జగదేవపూర్ మండలంలో తూతూమంత్రంగా సాగుతున్న 'బడిబాట'పై నిఘా పెట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రజావాణికి 26 ఫిర్యాదులు

**అశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 8**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పుడితే 'ఐదు వేల' ఫిక్స్‌డ్ డిపాజిట్: మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్ చెలిమెల రాములు!

- **-తూప్రాన్ మున్సిపాలిటీలో అరుదైన దృశ్యం.. ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చిన 13వ వార్డు కౌన్సిలర్.. మున్సిపల్ -కమిషనర్ సమక్షంలో లబ్ధిదారులకు బాండ్ అందజేత!**

**తూప్రాన్ జూన్ 8( అశ్వి అప్డేట్స్ )**

రాజకీయాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకులు అరుదుగా ఉంటారు. కానీ, తాను ఇచ్చిన హామీని గుండెల్లో పెట్టుకొని, ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసానిస్తూ తూప్రాన్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ చెలిమెల రాములు ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన వార్డులో ఏ దంపతులకైనా ఆడబిడ్డ జన్మిస్తే.. ఆ పాప పేరిట తన సొంత డబ్బుల నుండి 5,000 రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన ఓటర్లకు మాట ఇచ్చారు. నేడు ఆ మాటను అక్షరాలా నిజం చేసి చూపిస్తూ, వార్డు ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. మమత భాస్కర్ దంపతులకు రూ. 5000 పోస్టల్ బాండ్ 13వ వార్డుకు చెందిన కారంగుల మమత భాస్కర్ దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించింది. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ చెలిమెల రాములు.. తాను ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే స్పందించారు. ఆ పాప భవిష్యత్తు కోసం రూ. 5,000 విలువైన పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను సిద్ధం చేయించారు. సోమవారం తూప్రాన్ మున్సిపాలిటీలో 4, 9, 10, 13 వార్డులకు సంబంధించి నిర్వహించిన అధికారిక వార్డు సభల వేదికగా, మున్సిపల్ కమిషనర్ సమక్షంలో ఆ పోస్టల్ డిపాజిట్ బాండ్‌ను మమత భాస్కర్ దంపతులకు అత్యంత ఘనంగా అందజేశారు. రాములన్న సేవలకు వార్డు ప్రజల జేజేలు




ఆడపిల్లల చదువుకు, భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా కౌన్సిలర్ రాములు తీసుకున్న ఈ నిర్ణయంపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు తోటి ప్రజాప్రతినిధులు ప్రశంసల వర్షం కురిపించారు. రాజకీయాలకతీతంగా, కేవలం ప్రజలకు సేవ చేయాలనే తపనతో, ఆడబిడ్డలను మహాలక్ష్మిగా భావించి రాములు చేస్తున్న ఈ సేవలు అందరికీ ఆదర్శప్రాయం. ఎన్నికల హామీలను అటకెక్కించే ఈ రోజుల్లో.. ఇచ్చిన మాట కోసం సొంత నిధులు వెచ్చించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం." అని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తూప్రాన్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ చెలిమెల రాములు చేస్తున్న సేవలు, ఆయన మానవతా దృక్పథంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి

**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జూన్ 8**

పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా అటవీశాఖ అధికారి సత్యనారాయణ, లక్ష్మణ్, గ్రామ సర్పంచ్ వెంకట్రాముల గౌడ్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి ప్రజలకు తెలిపారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజులు కార్యాచరణలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నారాయణపేట మండలం కోటకొండ గ్రామాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వార్డు మెంబర్లు గ్రామ యువకులు పాల్గొన్నారు





# తెలుగు రాష్ట్రాల్లో చాపకింద నీరులా
# డ్రగ్స్ సరఫరా

**ఆందోళనలో తల్లిదండ్రులు**

**విద్యార్థులే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠాల వ్యాపారం**

**గల్ఫ్ దేశాల్లోని జైళ్లలో మగ్గుతున్న ఏపీ ప్రవాసులు..**

**దర్యాప్తునకు సహకరించని కుటుంబాలు**

**సీసీ కెమెరాల ఏర్పాటుతోనే యువతకు రక్షణ**

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**



# నీట్ రీ-ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- పేపర్ తయారీ నుంచి పంపిణీ వరకు ప్రత్యేక నిఘా
- వాయుసేన సహాయంతో ప్రశ్నపత్రాల రవాణా
- జూన్ 21 వరకు రహస్య ప్రదేశంలో నిపుణులు



AI generated image

**న్యూఢిల్లీ, జూన్ 8:** నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో జూన్ 21న నిర్వహించనున్న రీ-ఎగ్జామినేషన్‌ను అత్యంత భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రత్యేక చర్యలు చేపట్టాయి. పేపర్ లీకేజీకి ఏమాత్రం అవకాశం లేకుండా బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష పూర్తయ్యే వరకు రహస్య ప్రదేశంలో ఉంచినట్లు తెలుస్తోంది. వారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు అందుబాటులో లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. గతంలో ప్రశ్నపత్రాల రవాణా సమయంలో లీకేజీకి అవకాశం లభించిన నేపథ్యంలో ఈసారి భారత వైమానిక దళం సహాయంతో ప్రశ్నపత్రాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించనున్నారు. ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా ప్రశ్నపత్రాలను సురక్షితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రశ్నపత్రాల బాక్సులకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేయడంతో పాటు, ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ ప్రతి దశలో ప్రత్యేక భద్రత కల్పిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలించనున్నారు. సోషల్ మీడియాలో నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తున్న ముఠాలపై నిఘా పెట్టేందుకు సైబర్ విభాగాన్ని కూడా రంగంలోకి దించారు. గత పరీక్ష రద్దు కావడంతో రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయబోమని కేంద్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్ష నిర్వహణకు అయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది.

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

**రాజ్యసభ ఎంపి రాజీనామా**

**కోల్‌కతా, జూన్ 8:** టీఎంసీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ**

**న్యూఢిల్లీ, జూన్ 8:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది. టెహ్రాన్‌కు చెందిన మషహర్ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్‌పై దాడి చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ప్లాంట్ తీవ్రంగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. నైరుతి ఇరాన్‌లో పెట్రో కెమికల్స్ ఎగుమతుల్లో మషహర్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైనది.

# హోర్ముజ్ జలసంధి మూసివేత

**సంక్షోభంకొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం**

**దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు**


**కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్**



న్యూఢిల్లీ, జూన్ 8: హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.



# పెళ్ళైన మగవారు వేరే మహిళలను ఎందుకు ఇష్టపడతారో తెలుసా?



పెళ్ళి అంటే జన్మజన్మల అనుబంధం. జీవితకాలం కలిసి వచ్చే తోడు. అయితే పెళ్ళి వరకు ఉన్న వ్యక్తి.. పెళ్లి తర్వాత మారిపోతారు. ఇది ఎక్కువగా పురుషుల్లో జరుగుతుంది. వివాహమైన ఏడు సంవత్సరాలకు పురుషుల ఆలోచనల్లో మార్పు వస్తుందని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. పక్క చూపులు చూడటం మొదలవుతుందని.. ఫలితంగా చిన్న ఇల్లు అనే అంశం తెర్రపైకి వస్తుంటుందని అంటుంటారు. ఈ కోణంలో చాలా సినిమాలే వచ్చాయి! అయితే ఇలా మగవారు ఎందుకు మారిపోతారు అనే విషయాలపై పలువురి అభిప్రాయాలు ఎలా ఉన్నాయనేది ఇప్పుడు చూద్దాం!

సాధారణంగా పెళ్ళికి ముందు చాలా మంది మగవారు చాలా స్వేచ్ఛగా ఉంటారని అంటున్నారు. చదువుకునే సమయంలోనూ, చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాలు చేసే సమయంలోనూ కాస్త స్వేచ్ఛగా ఉంటారని.. ఆ సమయంలో వారిపై ఎలాంటి ఆంక్షలు ఉండవని చెబుతున్నారు. ఈ సమయంలో పెళ్ళాయిన తర్వాత వారి స్వేచ్ఛ ఒక్కసారిగా ఎగిరిపోయిందనే ఫీలింగ్ కి లోకి వస్తారంట మగవారు. పైగా ఇదంతా బాధ్యతల వల్ల వచ్చిందనే విషయం మరిచి... దీనికి కారణం వారి భార్య అని భావిస్తారంట. ఈ సమయంలో వారి భార్యల్ని కాకుండా ఇతర మహిళలల్ని ఇష్టపడతారని అంటున్నారు.



shutterstock.com · 2056340957

ఇదే సమయంలో ప్రతి వ్యక్తికి వారి వారి పార్టనర్ విషయంలో కొన్ని ఊహలు ఉంటాయని.. నిజ జీవితంలో అలాంటి పార్టనర్స్ దొరకకపోయిన సందర్భంలో.. వారి ఊహలకు అనుగుణంగా ఉన్నవారిని వెతుక్కుంటూ అందులో సంతృప్తి పొందుతారని చెబుతున్నారు. సాధారణంగా పెళ్లైన మగవారికి ఏదైనా విషయంలో తృప్తి లేకపోతే వెంటనే దాని నుంచి దూరంగా ఉంటారట. అయితే వివాహ బంధంలో అలా జరుగదు కాబట్టి... ఈ రిలేషన్ లో భార్య నుంచి వారు కోరుకునే ఆనందం దొరకని సమయాల్లో... వేరే మహిళలకి అట్రాక్ట్ అవుతారని అంటున్నారు.

ఇదే క్రమంలో... ప్రతి భర్త కూడా భార్యలు తమని ఇష్టపడాలని, వారి గురించి అన్ని విషయాలు జాగ్రత్తగా చూసుకోవాలని, వారే లోకంగా భావించాలని కోరుకుంటారట. అయితే పెళ్లైన అనంతరం అలా జరుగని పక్షంలో భర్తలు.. భార్యల్ని కాకుండా వేరే మహిళల్ని కోరుకుంటారని తెలుస్తోంది.

# ప పకోడి ఇలా చేశారంటే అదిరిపోతుంది


చేపతో వండిన వంటకాలకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఉంటుంది. చికన్ నచ్చదు, మటన్ నచ్చదు అనేవాళ్లు ఉంటారు కానీ చేప కూర నచ్చదు అనేవాళ్లు చాలా అరుదు. అలెర్జీ వంటి మెడికల్ కారణాలతో చేపను తినకుండా ఉండటమే కానీ.. చేపంటో స్వతహాగా నచ్చని వారుండరు. కానీ చేపతో క్రిస్పీగా, క్రంచీగా, జ్యూసీగా చేసే వంటకాలు చాలా తక్కువ. వాటిని చేయడం కూడా అంత ఈజీ కాదని చాలా మంది భావిస్తున్నారు. అయితే చల్లటి వాతావరణం ఉందంటే బజ్జీలు, పకోడీలు తినాలన్న కోరిక ఉంటుంది. వాటినే చేపతో చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఊహించుకుంటే నోరూరిపోతోంది కదూ. మరి అలాంటి క్రిస్పీ, జ్యూసీ చేప పకోడీ ఈజీగా.. అదిరిపోయే టేస్ట్‌తో చేసుకోవచ్చు తెలుసా. దీన్ని చేయడం చాలా సులువు. బోన్ లెస్ చేప ముక్కలు కొనుక్కుంటే పకోడీ చేసుకోవడం చాలా ఈజీ.





## కావాల్సిన పదార్థాలు

చేపలు ముక్కలు అరకిలో
వెల్లుల్లి ఆరు రెబ్బలు
నిమ్మరసం అర స్పూను
కొత్తిమీర తరుగు మూడు స్పూన్లు
ఉప్పు రుచికి సరిపడా
కార్న్ ఫ్లోర్ రెండు స్పూన్లు
మిరియాల పొడి అర స్పూను
కారం ఒక స్పూను
నూనె డీప్ ఫ్రై చేయడానికి సరిపడా



## తయారీ విధానం..

చేప పకోడి చేసేందుకు తక్కువ ముల్లులున్న చేపలను ఎంపిక చేసుకోవాలి. చేపలను ముక్కలను కోసి మధ్యలో ఉన్న పెద్ద ముల్లును తీసేయండి. బోన్ లెస్ చేప ముక్కలు నేరుగా మార్కెట్లో దొరుకుతాయి. వాటిని తెచ్చుకుంటే పని ఇంకా సులువు అవుతుంది. ఒక గిన్నెలో ఈ చేప ముక్కలను వేసి కార్న్ ఫ్లోర్ పిండి, ఉప్పు, మిరియాలపొడి, కారం, నిమ్మరసం వేసి బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. స్టవ్ మీద కళాయి పెట్టి డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేయాలి. నూనె వేడెక్కాక మ్యారినేట్ చేసుకున్న చేప ముక్కలు వేసి బంగారు రంగులోకి మారే వరకు వేయించాలి. చేపలు వేయించాక ఆయిల్ స్ట్రెయినర్ లో వేసి నూనె లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూను నూనె వేయాలి. అందులో సన్నగా తరిగిన వెల్లుల్లి రెబ్బలు, పచ్చి మిర్చి, కరివేపాకులు వేసి వేయించాలి. అందులో ఫిష్ పకోడా వేసి ఓసారి టాస్ చేసుకుని స్టవ్ ఆపేయాలి. అంతే టేస్టీ చేప రెసిపీ రెడీ అయినట్టే. నోట్లో పెడితే చాలు ఇక ఆపలేరు. మొత్తం తినేస్తారు. చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చేపలతో చేసే వంటకాల్లో చేప పకోడీ చాలా రుచిగా ఉంటుంది. దీన్ని వండడం చాలా సులువు, దీన్ని ఎయిర్ ఫ్రైయర్లో వండితే చాలా తక్కువ నూనెతో వండేయచ్చు.

# మూత్రం ఆపుకుంటే శరీరంలో ఏమవుతుందో తెలుసా..?

మూత్ర విసర్జన కచ్చితంగా ప్రతీ జీవి చేయాల్సిందే.. సరైన విధంగా రోజూ ఇబ్బంది లేకుండా మూత్ర విసర్జన చేస్తేనే ఆ వ్యక్తి ఆ జీవి ఆరోగ్యంగా ఉన్నట్లు చెబుతారు, లేకపోతే అనారోగ్యంగా ఉన్నట్లే, అయితే మన శరీరంలోని వ్యర్థాలు అన్నీ మూత్రం ద్వారా బయటకు వస్తాయి అనేది తెలిసిందే..ఒంట్లో ఉన్న మలినాల్ని కడిగి తనతోపాటు బయటకి తీసుకెళ్ళే ద్రవ పదార్థమే మూత్రం. కాని కొందరు మాత్రం మూత్రం వెంటనే పోయరు , దానిని నిలిపివేస్తారు, ఇది చాలా డేంజర్ అంటున్నారు వైద్యులు, నిద్రపోయిన సమయంలో చాలా మంది మూత్రం వచ్చినా ఆపుకుంటారు. ఇది కూడా మంచిది కాదు అని చెబుతున్నారు వైద్యులు. మన మూత్రం శరీరంలోని టాక్సిన్స్ మలీనాల్ని సాధ్యమైనంతవరకు క్లీన్ చేస్తుంది... ఇది కిడ్నీల్లోంచి బ్లాడర్ లోకి వెళుతుంది. మన బ్లాడర్ ఎప్పుడు కూడా ఫుల్ అయితేనే మూత్రాన్ని బయటకి తోయమని ఫోర్స్ చేస్తుంది. మూత్రం వస్తోందన్నట్లు అనిపిస్తేనే అర్థం చేసుకోవాలి.. బ్లాడర్ ఫుల్ అయిపోతుంది దాన్ని ఖాళీ చేయాలి అని. ఇక ఇక్కడ మరో విషయం మన బ్లాడర్ లో 400 మిల్లీ లీటర్ల మూత్రం ఉంటుంది ,అది దాటితే కచ్చితంగా బ్లాడర్ మీద ఒత్తిడి పెరుగుతుంది అని చెబుతున్నారు వైద్యులు, ఇలా బ్లాడర్ లో సమస్యలు రావడానికి ఇదే కారణం అని చెబుతున్నారు వైద్యులు, అందుకే మూత్రం ఆపకండి అని చెబుతున్నారు.



# జాన్వీ కపూర్ చెప్పినా డైరెక్టర్ వినలేదు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ జంటగా నటించిన లేటెస్ట్ మూవీ పెద్ది. మూడు రోజుల కిందట రిలీజ్ అయిన ఈ సినిమా, బాక్సాఫీస్ ను దున్నేస్తోంది. అయితే పెద్ది సినిమాలో బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ స్కిన్ షో పై విమర్శలు తీవ్ర స్థాయిలో వస్తున్నాయి. సినిమా షూటింగ్ సమయంలోనే ఈ స్కిన్ షోపై జాన్వీ అభ్యంతరం చెప్పినట్లు స్క్రీన్ షాట్లు కూడా వైరల్ అయ్యాయి.

అయితే ఈ వివాదంపైన తాజాగా జాన్వీ కపూర్ మేకప్ ఆర్టిస్ట్ సావ్లీన్ కౌర్ సోషల్ మీడియా వేదికగా సంచలన పోస్ట్ చేసి.. మరో వివాదానికి తెర లేపారు. జాన్వీ కపూర్ ప్రొఫెషనల్ బౌండరీ గీశారని.. బోల్డ్ సీన్లు వద్దని ముందే చెప్పినట్లు వెల్లడించారు. కానీ సినిమా డైరెక్టర్ మాత్రం గీత దాటి... తనకు నచ్చినట్లు చేశారని ఆరోపణలు చేశారు. బాక్సాఫీస్ నెంబర్స్ కోసం ఫైనల్ ఎడిట్ లో.. స్కిన్ షో అలాగే ఉంచారని ఆరోపించారు. దీంతో జాన్వీ మేకప్ ఆర్టిస్ట్ సావ్లీన్ కౌర్ చేసిన పోస్టు దుమారం లేపుతోంది.

కోలీవుడ్ యంగ్ బ్యూటీ తేజు అశ్విని యూట్యూబర్‌గా కెరీర్ మొదలుపెట్టి నటనపై ఆసక్తితో నటిగా ఇండస్ట్రీకి హీరోయిన్‌గా వచ్చారు. 'ఎన్నా సొల్ల పోగిరై' మూవీతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు సినిమాలు చేసి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'నవాబ్ కేఫ్' అనే సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చారు. యంగ్ హీరో శివ కందుకూరి సరసన ఆమె నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం తేజు అశ్విని తమిళంలో 'మూండ్రమ్ కన్' అనే క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు. దీనితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులకు కూడా సైన్ చేశారు. సినిమాల్లో రాణిస్తూ బిజీగా ఉన్నప్పటికీ.. తాను కొన్ని పెద్ద చిత్రాలలో నటించే అద్భుతమైన అవకాశాలను కోల్పోయానని తేజు అశ్విని తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సూపర్ హిట్ అయిన చిత్రాల్లో తనకు ఆఫర్లు వచ్చినప్పటికీ, కొన్ని కారణాల వల్ల వాటిని చేయలేకపోయానని మనసు విప్పి మాట్లాడారు.

"నేను కోలీవుడ్ హిట్ హర్రర్ ఫ్రాంచైజీ 'డిమోంటే కాలనీ 2' సినిమాలో భాగం కావాల్సింది. ఆ చిత్రంలో నటించే అవకాశం నా దాకా వచ్చింది, కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ కుదరలేదు. అలాగే యువతను ఎంతగానో ఆకట్టుకున్న 'లవర్' చిత్రం కోసం కూడా మేకర్స్ నన్ను పరిశీలించారు. ఆ సినిమాలో హీరోయిన్ పాత్రకు నేను ఎంపికయ్యేలా కనిపించినా, దురదృష్టవశాత్తు కొన్ని కారణాల వల్ల అందులోనూ నటించలేకపోయాను" అని చెప్పారు. అలాగే ఇండస్ట్రీలో అవకాశాల గురించి మాట్లాడుతూ.. "కొన్నిసార్లు ఒక నటి ప్రయాణంలో మనకు దక్కని పాత్రలే మనల్ని ఎక్కువగా ఆలోచింపజేస్తుంటాయి. 'ఒకవేళ ఆ పాత్ర నేను చేసి ఉంటే నా కెరీర్ ఎలా ఉండేదో' అనే ఆలోచనలను మిగిల్చే అతిపెద్ద అంశాలుగా ఇవి మారుతుంటాయి. కానీ వాటన్నింటినీ దాటుకుని ముందుకు వెళ్లడమే ఒక నటిగా అసలైన ప్రయాణం" అని తేజు అశ్విని చెప్పుకొచ్చారు. కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి మంచి హిట్ సినిమాలను కోల్పోవడం బాధాకరమే అయినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలతో అలరిస్తానని ధీమా వ్యక్తం చేశారు.



## దురదృష్టవశాత్తు కొన్ని చాన్సులు మిస్ అయ్యాయి..



## 'మా బతుకులతో ఆడుకుంటే వదలం'..

టాలీవుడ్ హీరోలకు మాస్ ఇమేజ్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిన డైరెక్టర్ పూరీ జగన్నాథ్. గత కొంత కాలంగా ఆయనకు సరైన హిట్ లేదనే విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆయన తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్' (SlumDog – 33 Temple Road). పూరీ జగన్నాథ్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ – జె.బి మోషన్ పిక్చర్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జె.బి నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, టబు, సంయుక్త, దునియా విజయ్ కుమార్, జరీనా వహాబ్, వి.టి.వి గణేష్, బ్రహ్మాజీ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి.. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నిన్ను ఎందుకు వదులుతాం" అంటూ సాగే భావోద్వేగభరితమైన డైలాగ్‌తో టీజర్ స్టార్ట్ అయిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. టీజర్ అంతటా పవర్‌ఫుల్ యాక్షన్ ఎపిసోడ్స్, ఫైట్స్, మాస్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంది. ప్రతి పాత్రను చాలా ఇంటెన్సివ్‌గా చూపించారు మేకర్స్. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందిస్తుండగా, శామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. సంతోష్ నూజిళ్ల ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో త్వరలో ఈ చిత్రం థియేటర్లలో అలరించడానికి రెడీ అవుతుంది. పూరీ జగన్నాథ్ మార్క్ యాక్షన్, బలమైన ఎమోషన్స్‌తో కూడిన ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పూరీ ఫ్యాన్స్‌తో పాటు సినిమా లవర్స్ ఆయన కంబ్యాక్‌ను గట్టిగా కోరుకుంటున్నారు. తాజాగా రిలీజ్ అయిన ఈ స్లమ్‌డాగ్ టీజర్‌తో ఈసారి పూరీ పక్కా హిట్ కొడతాడని ఆయన ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సుకుమార్ శిష్యుడు అనిపించుకున్న బుచ్చి..

'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయమై, తాజాగా రామ్ చరణ్‌తో 'పెద్ది' సినిమాను తెరకెక్కించిన బుచ్చిబాబు సనా టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అనే విషయం తెలిసిందే. బుచ్చిబాబు తన గురువు సుకుమార్‌ను అనేక విషయాల్లో ఫాలో అవుతున్నారని పలు సందర్భాల్లో స్పష్టమైంది. సుకుమార్ తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న విమర్శల తరహానే, ఇప్పుడు బుచ్చిబాబు కూడా తన రెండవ సినిమాతో విమర్శలను ఎదుర్కొంటున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సుకుమార్ తన మొదటి చిత్రం 'ఆర్య'తో దర్శకుడిగా మంచి విజయాన్ని సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే ఆ తర్వాత రామ్ పోతినేనితో చేసిన 'జగడం' సినిమాలో హీరోయిన్ పాత్రను బోల్డ్‌గా చూపించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ పాత్రలోని కొన్ని సంభాషణలు, ప్రవర్తన ప్రేక్షకులను అసౌకర్యానికి గురి చేశాయని అప్పట్లో చర్చ జరిగింది. 'ఆర్య'లాంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఇలాంటి పాత్రను ఎందుకు రూపొందించారన్న విమర్శలు కూడా వినిపించాయి.


ఇక అదే తరహాలో బుచ్చిబాబు సనా తన రెండవ సినిమా 'పెద్ది'లో జాన్వీ కపూర్ పాత్రను కూడా బోల్డ్‌గా చూపించారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ సినిమాలో ఆమె పాత్రపై సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బుచ్చిబాబు సనా స్పందిస్తూ క్షమాపణలు చెప్పడంతో పాటు, జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగిస్తున్నట్లు తెలిపారు.



## సూర్య 48కు దర్శకుడు ఖరారు?

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తాజాగా 'కరుప్పు' చిత్రంతో సూపర్ సాలిడ్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఆయన దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలో హీరోగా నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఇదిలా ఉంటే సూర్య తదుపరి చిత్రానికి సంబంధించిన ఓ కీలక వార్త ప్రస్తుతం కోలీవుడ్ మీడియాలో వైరల్ అవుతోంది. సూర్య తన నెక్స్ట్ మూవీని పా రంజిత్ దర్శకత్వంలో చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇప్పటికే పా రంజిత్ ఓ కథను సూర్యకు వినిపించగా, అది ఆయనకు బాగా నచ్చినట్లు సమాచారం. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సూర్య కూడా సానుకూలంగా స్పందించినట్లు టాక్ వినిపిస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే మరికొన్ని రోజుల్లోనే ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'కరుప్పు' వంటి భారీ సక్సెస్ తర్వాత సూర్య ఏ దర్శకుడితో సినిమా చేయనున్నాడనే ఆసక్తి కోలీవుడ్ వర్గాల్లో కూడా బలంగా నెలకొంది.



## నేను ఎప్పుడో హీరో అయ్యాను.. దేవి ఇప్పుడు అయ్యాడు..

స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ తాజాగా 'ఓజీ టూర్' కాన్సర్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. ఈ క్రమంలో తన సహ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా సినిమా చేస్తున్న విషయంపై ప్రశ్నలు ఎదురయ్యాయి. "మీరు ఎప్పుడు హీరోగా సినిమా చేస్తారు?" అని జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు తమన్ ఆసక్తికరంగా స్పందించారు. తాను ఇప్పటికే 'బాయ్స్' సినిమాలో హీరోగా నటించినట్లు గుర్తు చేసిన ఆయన, "నేను ఎప్పుడో హీరోగా చేశాను, దేవి ఇప్పుడు హీరోగా చేస్తున్నాడు. ఆయన మనకెందుకు అలాంటి విషయాలు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

నటుడిగా పని చేయడం చాలా కష్టమని, ఎండలో షూటింగ్ చేయాల్సి వస్తుందని, అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. సంగీత దర్శకుడిగా ఉండటం ఎంతో అదృష్టమని, ఆ సౌకర్యం దేవుడిచ్చిన వరమని తెలిపారు. దేవి శ్రీ ప్రసాద్ హీరోగా చేస్తున్న సినిమాపై తనకు పూర్తి నమ్మకం ఉందని, అది తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని తమన్ అభిప్రాయపడ్డారు. అలాగే నిర్మాత దిల్ రాజు కూడా ఆ కథ గురించి తనతో మాట్లాడారని వెల్లడించారు. అవసరమైతే ఆ సినిమాకు రెండు, మూడు పాటలు ఇవ్వడానికి కూడా సిద్ధమని ఆయన చెప్పారు. అందరూ కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని తమన్ పేర్కొన్నారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.





## ఆ ప్రముఖ సంస్థ చేతికి వృషకర్మ నాన్‌థియేట్రికల్ హక్కులు

అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా కనిపించనుంది. 'తండేల్' విజయం తర్వాత నాగ చైతన్య నటిస్తున్న సినిమా కావడం, అలాగే 'విరూపాక్ష' వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ బయటకు వచ్చింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ మూవీకి సంబంధించిన నాన్‌థియేట్రికల్ డీల్ ఇప్పటికే క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ జీ సంస్థ ఈ సినిమా నాన్‌థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. స్పర్శ్ శ్రీవాత్సవ్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనుండగా, జయరామ్ కీలక పాత్రలో నటించనున్నారు. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు సుకుమార్ కథను అందించారు. బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in